# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, గురువారం 19 డిసెంబర్ 2024 | HYDERABAD




రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వర్ధపల్లి 'నమస్తే తెలంగాణ ' రిపోర్టర్ కడియాల రమేశ్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని ఈ సందర్భంగా డాక్టర్లకు ఎమ్మెల్యే సూచించారు. - కాప్రా, డిసెంబర్ 18






## నేనున్నాను..

ఆటో ర్యాలీలో భాగంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆటోలో ఎక్కి కూర్చున్నారు. ఆటో నడిపే డ్రైవర్లను అసెంబ్లీలోకి రానివ్వరు. దీంతో ఎమ్మెల్యేలు స్వయంగా ఆటో నడుపుకొంటూ అసెంబ్లీలోకి వెళ్లాలని భావించారు. అయితే ఎవరికీ ఆటో నడుపొచ్చొననే చర్చలు ప్రారంభమయ్యాయి. ఇంతలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ 'నా కొచ్చు' అంటూ ఆటో హ్యాండిల్ పట్టుకొని రెడీ అయిపోయారు. ఆ తర్వాత మరో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కూడా తనకూ వచ్చునని ఆటో తీసుకున్నారు. మరో ఆటో అవసరం ఉంది కదా ఎవ్వరున్నారు అని అడుగుతుండగానే.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'నేనున్నాను' అంటూ వచ్చేశారు. స్వయంగా కేటీఆర్ ఆటో స్టార్ట్ చేసి ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను ఎక్కించుకుని అసెంబ్లీకి బయలుదేరారు. రోడ్డు వెంట కేటీఆర్ ఆటో నడుపుకొంటూ వెళ్తుంటే.. అది చూసిన జనం తమ మొబైల్ ఫోన్లో వీడియోలు తీశారు. జై కేటీఆర్..జై కేసీఆర్.. జై తెలంగాణ అంటూ నినాదాలు చేసి.. తమ అభిమానాన్ని చాటుకున్నారు.






ఖాకీ చొక్కాలు ధరించి..ఆటో డ్రైవర్లకు సంఘీభావం తెలుపుతూ.. నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, మధుసూదనాచారి, శంభీపూర్ రాజు తదితరులు

# ఆటో అన్నలూ..అధైర్యపడొద్దు

## మేమున్నాం..మీ కోసం పోరాడుతాం

### ఆటో డ్రైవర్లకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఘీభావం.. ఖాకీ దుస్తుల్లో అసెంబ్లీకి.. సర్కారు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ నిరసన

'ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి.. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి... ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మిక కుటుంబాలను వెంటనే ఆదుకోవాలి.' అని నినాదాలు చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు బుధవారం ఆటో డ్రైవర్ల యూనిఫాం ఖాకీ చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లారు. ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి 25 ఆటోల్లో ర్యాలీగా అసెంబ్లీ వరకు వెళ్లారు. కేటీఆర్ స్వయంగా ఆటో నడుపుతూ.. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున కేటీఆర్ వద్దకు చేరుకుని తమ సమస్యలపై పోరాడుతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 8 లక్షల ఆటో డ్రైవర్ల కుటుంబాలకు చాలా పెద్ద ఎత్తున వరాల మూట ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని అన్నారు. డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని.. ఇన్సూరెన్స్‌లు పెంచుతామని, జీవన భద్రతకు ఢోకా లేకుండా చేస్తామని రకరకాల హామీలిచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డేటా మొత్తం గతంలో జరిగిన శాసనసభ సమావేశంలోనే ప్రభుత్వానికి అందజేశామని గుర్తు చేశారు. ఇంతమంది ఆటో డ్రైవర్లు చనిపోయారు.. ఒక్కొక్క కుటుంబానికి పది లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ఎంతో ఇచ్చి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశామన్నారు. కానీ ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డట్టు ఇప్పటి వరకు స్పందించలేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో అన్నలకు సంఘీభావంగా మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు తామంతా అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇచ్చామని చెప్పారు. ఖాకీ చొక్కాలు ధరించి ఆటోల్లోనే అసెంబ్లీకి వెళ్లామని పేర్కొన్నారు. కాగా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ ఆటో ర్యాలీలో పాల్గొని ఆటో డ్రైవర్లకు అండగా నిలిచారు.

'మేమున్నాం.. అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం.. మీ కష్టాలు పరిష్కరించేందుకు పోరాటాలు చేస్తామం'టూ.. ఆటోడ్రైవర్లకు భరోసా కల్పించారు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు. ఆటో డ్రైవర్లకు సంఘీభావం తెలుపుతూ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు బుధవారం ఖాకీ చొక్కాలు ధరించి..ఆటోలో అసెంబ్లీకి వెళ్లారు. ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ.. ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి.. రూ. 12వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని.. బీఆర్‌ఎస్ పక్షాన తాము పోరాడతామని స్పష్టం చేశారు.

- సిటీబ్యూరో/ కేపీహెచ్‌బీకాలనీ /కాప్రా/ ఎల్బీనగర్



ఆటో డ్రైవర్లకు మద్దతుగా జరిగిన నిరసనలో పాల్గొన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్‌రాజు, మహమూద్ అలీ



ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, పద్మారావుగౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్



## 'మాట నిలుపుకోవాలి'

సిటీబ్యూరో: సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ డీఈఓ కార్యాలయం ఆవరణలో వారం రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఉద్యోగులందరికీ పే స్కేల్ వెంటనే అమలు చేయాలని కోరారు. సమస్యను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని ఉద్యోగులు చెప్పారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.

## 'రెగ్యులరైజ్ చేయాలి'

రవీంద్రభారతి: రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి 1960 మందికి పైగా ఉద్యోగులు విద్యాశాఖ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులమైన తాము చాలా పేదరికంలో ఉన్నామని, చాలీచాలని జీతాలతో ఎన్నో ఇక్కట్లకు గురవుతున్నామని చెప్పారు.

## 'హామీలు విస్మరించడం శోచనీయం'

సుల్తాన్‌బజార్: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు హామీని విస్మరించడం శోచనీయమని ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ ధ్వజమెత్తారు. తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని తదితర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష దీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపిన శ్రీకాంత్ ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. చాలీచాలని వేతనాలతో ఉద్యోగ భద్రత లేని కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేసేంతవరకు అండగా ఉంటామని శ్రీకాంత్ హామీనిచ్చారు. సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం నాయకులు శ్రీనివాస్, ఇంద్రకంటి సరిత, నవనీత, శ్రీవాణి, రమ్య, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# కూల్చరెందుకో..?

### రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు.. చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

బేగంపేట: బేగంపేట డివిజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రధాన, అంతర్గత రోడ్లు అనే తేడా లేకుండా కొందరు నిర్మాణదారులు భవనాలను ఆరు అంతస్తుల వరకు నిర్మిస్తున్నారు. రోడ్లను ఆక్రమించి భవనాలను మరీ రోడ్లపై వరకు నిర్మిస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. బేగంపేట డివిజన్‌లోని కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి నుంచి ప్రేమ్‌సాగర్, మహావీర్ అపార్ట్‌మెంట్స్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఓ వ్యక్తి రోడ్డుపై వరకు భవన నిర్మాణాన్ని చేపట్టాడు. స్థానికులు సామాజిక మాధ్యమాల్లో అక్కడ తలెత్తుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి వరకు మిన్నకుండిపోయిన బేగంపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అ భవనాన్ని పరిశీలించారు. రోడ్డుపై నిర్మిస్తున్న భవన యజమాని నిర్మాణానికి ఎలాంటి అనుమతి తీసుకోకుండా అక్రమంగా భవనాన్ని నిర్మిస్తున్నట్టు గుర్తించారు. అప్పటి వరకే గ్రౌండ్ ప్లస్ మొదటి అంతస్తు వరకు నిర్మాణం చేశారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు వెనువెంటనే నోటీసులు జారీచేసి.. ఆ భవన నిర్మాణాన్ని అడ్డుకున్నారు. నిర్మాణాన్ని నిలిపివేశారు. నిలిపి వేసిన నిర్మాణాన్ని పూర్తిగా కూల్చివేసి.. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అక్కడి స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాగే బేగంపేటలో అనేక ప్రాంతాల్లో జీ ప్లస్ టూ అంతస్తులకు అనుమతులు తీసుకొని మరో రెండు మూడు అంతస్తుల్లో నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమంగా అదనంగా ఫ్లోర్స్ నిర్మిస్తున్న అక్రమదారులను గుర్తించి వాటి నిర్మాణాలు కూడా నిలిపి వేయాలని స్థానికులు కోరుతున్నారు.



సన్‌షైన్ వైద్యశాల నుంచి ప్రేమ్‌సాగర్ మార్గంలో నిర్మిస్తున్న భవనం

# రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం వైఫల్యమే..

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి: భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం ప్రభుత్వ వైఫల్యమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని 382 ఎకరాలు, 100 సర్వే నంబర్లు, 70 కాలనీల్లోని భూముల లావాదేవిలను వక్ఫ్ బోర్డు సీఈవో ఇటీవల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాదాపు 30 ఏండ్ల కిందట ఇక్కడ ఇండ్లు కట్టుకొని పేదలు నివసిస్తున్నారన్నారు. దాదాపు 1,967 కుటుంబాల్లో లక్ష మంది నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఇండ్ల కొనుగోలు, అమ్మకాలు నిషేధించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు నిషేధించిన జాబితా నుంచి పేదల ఇండ్లను తొలగించాలని సీఎంను కోరానని చెప్పారు. గౌతంనగర్ డివిజన్ ప్రజల దాహార్తిని తీర్చడానికి 5 ఎంఎల్ రిజర్వాయర్‌ను నిర్మించాలని కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గంలోని చెరువుల పరిరక్షణతో పాటు సుందరీకరణకు చేయాలని సీఎంకు వినతిపత్రం అందజేశానని తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

### అందని ద్రాక్షగా విదేశీ విద్య

పేద విద్యార్థులకు విదేశీ విద్య అందని ద్రాక్షగా మారిందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీలో విదేశీ విద్యార్థుల ఫీజుల బడ్జెట్‌పై ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్రాహ్మణ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందజేయడంలో జాప్యం జరుగుతుండడంతో వివిధ దేశాల్లో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో ఫీజులు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్థిక సంవత్సరంలో 100 కోట్ల బడ్జెట్ కేటాయించినా.. ఇప్పటికీ రూ.30 కోట్లు మాత్రమే విడుదల చేశారని ఎమ్మెల్యే వివరించారు.

# మళ్లీ పాతరోజులు..

### బిందెలు..బకెట్లు..వాటర్ క్యాన్లతో ట్యాంకర్ల వద్దకు..

### ఖైరతాబాద్ ఇందిరానగర్‌లో 5 రోజులుగా నల్లా నీరు బంద్.. డబుల్ గృహాల్లో దాహం దాహం

ఖైరతాబాద్, డిసెంబర్ 18 : మళ్లీ మునుపటి రోజులు గుర్తుకు వస్తున్నట్లు కనిపిస్తోంది. ఖైరతాబాద్ ఇందిరానగర్‌లోని డబుల్ గృహాల సముదాయంలో తాగునీటికి కటకట ఏర్పడింది. ఐదు రోజులుగా జలమండలి నుంచి నీటి సరఫరా నిలిచిపోయినా.. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో రోజు అవసరాలు, తాగునీటికి నివాసితులు ఇబ్బందులుపడుతున్నారు. రోజుల తరబడి విజ్ఞప్తుల మేరకు ఎట్టకేలకు బుధవారం ట్యాంకర్లు పంపించడంతో ఒక్కసారిగా సుమారు 210 గృహాలకు చెందిన నివాసితులు నీటి కోసం ఇంట్లో ఉన్న బిందెలు...బకెట్లు...వాటర్ క్యాన్లతో పరుగులు తీశారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ తమకు నీటి కష్టాలు మొదలయ్యాయి అంటూ..నిట్టూర్చారు.




నీటి కోసం ట్యాంకర్ వద్ద బారులు తీరిన డబుల్ బెడ్రూం గృహాల నివాసితులు

### ఒక్కసారిగా..

ఖైరతాబాద్ డబుల్‌బెడ్రూం గృహ సముదాయానికి ఒకసారి రోజు విడిచి రోజు, అప్పుడప్పుడూ రెండు రోజుల కోసారి నల్లా నీరు వచ్చేది. శనివారం నుంచి ఒక్కసారిగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మూడు రోజులు గడిచినా.. నీరు రాకపోవడంతో జలమండలి అధికారులను సంప్రదించగా, రెడ్‌హిల్స్ వద్ద మరమ్మతు పనులు జరుగుతున్నాయని, ఇంకా టైమ్ పడుతుందని చెప్పారు. డబుల్ బెడ్రూం సముదాయంలో ఏ బ్లాకులో 30, బీ బ్లాకులో 80, సీ బ్లాకులో 40, డీ బ్లాకులో 60 ఇండ్లు ఉన్నాయి. ఏ, బీ బ్లాకులకు 50వేల లీటర్లు, సీ, డీ బ్లాకులకు కలిపి 30వేల లీటర్ల సంపు నిర్మించారు. అన్ని గృహాలకు కలిపి ఒకే ఒక్క బోరు ఉండటంతో పాటు బీ బ్లాకుపై ఒకే ఒక్క 18వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంకు ఉంది. దీంతో జలమండలి ద్వారా వచ్చే నీటిపైనే వందలాది కుటుంబాలు ఆధారపడ్డాయి. నీటి సరఫరా నిలిపివేసిన జలమండలి..ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో నీటి కోసం గోసపడటం నివాసితుల వంతైంది.

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు...



ఖైరతాబాద్ డబుల్ బెడ్రూం గృహాల్లో గత ఐదురోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. పైపులైన్లు దెబ్బతిన్న విషయాన్ని ముందుస్తుగా చెప్పాల్సిన అధికారులు సమాచారం ఇవ్వలేదు. నాలుగు రోజులు గడిచిన తర్వాత ఫోన్ చేస్తే విషయాన్ని చెప్పారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ఫోన్లు చేసినా నిర్లక్ష్యం వహించారు. ఐదు రోజుల తర్వాత ట్యాంకర్‌ను పంపించారు. అది కూడా రెండు మాత్రమే ..ఆ నీరు 200 కుటుంబాలకు ఏ మాత్రం సరిపోలేదు. డబుల్ బెడ్రూం బీ బ్లాకులో మరో 18వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించే అవకాశం ఉన్నా అటు ఎమ్మెల్యే, ఇటు సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

– అనిల్ కుమార్, అధ్యక్షుడు, 2బీహెచ్‌కే డిగ్నిటీ వెల్ఫేర్ అసోసియేషన్.

### ఎన్నడూ పట్టించుకోని ఎమ్మెల్యే..

గత ఏడాది కాలంగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్న డబుల్ బెడ్రూం గృహ నివాసితులు తమ సమస్యను గతేడాది ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పవర్ బోరు వేయించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చి మరోసారి ఇటువైపు కన్నెత్తి చూడలేదని..స్వయంగా వెళ్లి కలిసినప్పుడు రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తూ గాలి మాటలు చెబుతున్నారని గృహ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కేవలం పేరుకే ఉన్నారని, తమ గోడును ఎన్నడూ పట్టించుకున్న పాపన పోలేదని ఆరోపిస్తున్నారు.

### రెడ్‌హిల్స్ ఎఫెక్ట్....

ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ నుంచి రెడ్‌హిల్స్‌కు వచ్చే తాగునీటి పైపులైను వారం రోజుల కిందట పగిలిపోయింది. జలమండలి అధికారులు నామమాత్రంగా సమాచారం ఇచ్చి సరైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పైపులైపు పగిలిన నేపథ్యంలో ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని అనేక కాలనీలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఒక్కొక్క కాలనీలో నీటి సరఫరాను పునరుద్ధరిస్తూ వస్తున్న అధికారులు డబుల్ గృహాలపై దృష్టి పెట్టలేదని ఆరోపిస్తున్నారు. ఫలితంగా ఎక్కడా వెళ్లలేని పరిస్థితుల్లో ఖైరతాబాద్ ఇందిరానగర్ డబుల్ గృహాల్లో నివాసం ఉంటున్న 200 కుటుంబాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నాయి.